క్లుప్తంగా

ఏకలవ్య పాఠశాలను సందర్శించిన ఈఎన్‌సీ



ఐటీడీఏ అధికారులతో మాట్లాడుతున్న ఈఎన్‌సీ శ్రీనివాస్

మక్కువ: మండలంలోని అనసబద్ర గ్రామ సమీపంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాలను ఈఎన్‌సీ ఎస్.శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావడంతో ఈ నెల 14న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. సుమారు రూ.12కోట్లతో ఏకలవ్య పాఠశాల భవనాలు నిర్మాణం చేపట్టారు. భవన నిర్మాణాలను పరిశీలించిన ఈఎన్‌సీ శ్రీనివాస్ మిగిలిన చిన్న,చిన్న పనులు ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఈఈ శాంతేశ్వరరావు, డీఈ మణిరాజ్, ఏఈ సత్యనారాయణకు సూచించారు.

11న రక్తదాన శిబిరం

మక్కువ: మండల కేంద్రం మక్కువలో ఈ నెల 11న మహాలక్ష్మి మెడికల్ షాపు వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు వి.పకీరురాజు తెలిపారు. విశాఖపట్టణంకు చెందిన రోటరీ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో, డాక్టర్ అశోక్‌కుమార్ పర్యవేక్షణలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఆసక్తి గల యువకులు రక్తదానంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

నేడు జీడితోటల పెంపకంపై అవగాహన సదస్సు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి జట్టు ట్రస్ట్ ప్రాంగణంలో జీడితోటల పెంపకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రాంగణంలో ట్రస్టీ డి.పారినాయుడు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. మానవ వనరుల అభివృద్ధి డైరెక్టర్ జనరల్ ఆర్‌పీ సిసోడియా ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై, జీడితోటల పెంపకం, నిర్వహణలపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అలాగే లాభదాయకంగా జీడితోటలు ఎలా పెంచాలి.. పంటను ఎలా సంరక్షించుకోవాలన్న విషయాలపై అవగాహన కల్పించనున్నారన్నారు. జీడిరత్న పేరిట ఉత్తమ జీడిమామిడి రైతులకు అవార్డులు అందివ్వనున్నామన్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

పాలకొండ రూరల్: వాహన చోదకులందరూ తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సీఐ ఎం. చంద్రమౌళి అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని, తనిఖీల్లో పట్టుబడితే వాహన యజమానులపై కేసు నమోదు చేస్తామన్నారు. శుక్రవారం స్థానిక శ్రీకాకుళం రహదారిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం విధించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● పాలకొండ ఏఎస్‌డబ్ల్యూవో పి. శ్రీకాంత్



మరుగుదొడ్లు పరిశీలించి, వసతిగృహ సంక్షేమ అధికారికి సూచనలిస్తున్న ఏఎస్‌డబ్ల్యూవో శ్రీకాంత్

కురుపాం: వసతిగృహాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పాలకొండ ఏఎస్‌డబ్ల్యూవో పి.శ్రీకాంత్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు వసతిగృహాలను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు గురువారం సందర్శించి, వాటి నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్థానిక సాంఘిక సంక్షేమ బాలురు వసతిగృహాన్ని ఏఎస్‌డబ్ల్యూవో శుక్రవారం సందర్శించి, అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, మినరల్ వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించి, సంబంధిత వసతిగృహ సంక్షేమ అధికారి శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అందాల్సిన సదుపాయాల విషయంలో జాప్యం చేయొద్దని, మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని తెలిపారు.

సురక్షతో అందరికీ ఆరోగ్యం



సురక్షా శిబిరంలో సూచనలు చేస్తున్న వైద్యాధికారి దామోదరరావు

భామిని: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ధ్యేయంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని బత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి కె. దామోదరరావు, కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. బత్తిలిలో శుక్రవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పలువురు రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

నులి పురుగులను నివారిద్దాం

ఆల్బెండజోల్ మాత్రలు వేయడం ద్వారా చిన్నారుల్లో ఏర్పడే నులి పురుగులను నివారిద్దామని పలువురు వైద్యులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడంలో సహకరించాలని కోరారు. శుక్రవారం అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను వేశారు.

– సాక్షి నెట్‌వర్క్



బలిజిపేట: పెదపెంకి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ నాగమణి, జడ్పీటీసీ రవికుమార్, అధికారులు



సాలూరు: పట్టణంలో నాల్గో వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నులిపురుగుల నివారణ మాత్రలు వేయిస్తున్న పట్టణ సీడీపీఓ సత్యవతి



సీతానగరం: నిడగల్లు పాఠశాలలో నులి పురుగులు నివారణ మాత్ర వేయిస్తున్న డాక్టర్ ప్రభుదేవ్

రోగులకు మెరుగైన వైద్య సేవలు

● డీఎంహెచ్‌ఓ డాక్టర్ జగన్నాథరావు

సీతానగరం: జిల్లా వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్) 2 కార్యక్రమం ద్వారా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను రోగులు, అస్వస్థతకు గురైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బగాది జగన్నాథరావు కోరారు. పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో లక్ష్మీపురంలో శుక్రవారం నిర్వహించిన జేఏఎస్-2 జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు, రోగుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను, రోగులకు స్పెషలిస్ట్ డాక్టర్లు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ స్థానికంగా వైద్య సేవల కోసం వచ్చిన రోగులకు ఆయుర్వేద మందులు, ఇంగ్లిష్ మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మండలానికి జేఏఎస్-2 ద్వారా వారం రోజుల్లో రెండు వైద్యశిబిరాలు జరుగుతున్నాయని తెలిపారు. జేఏఎస్-2 ఉచిత వైద్య శిబిరంలో ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు, స్పెషలిస్ట్ డాక్టర్లు ఫల్మనాలజిస్ట్ డాక్టర్ దుర్గాప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ పవన్, పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్, బూర్జ ఆయుష్ ఆస్పత్రి డాక్టర్ తెర్లి హేమాక్షి, నేత్రవైద్యులు రమేష్, హెల్త్ సూపరువైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, సర్పంచ్ టి సత్యవతి, ఎంపీటీసీ టి.పార్వతి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



జేఏఎస్-2 లో ఆయుష్ మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

285మందికి వైద్య సేవలు

బలిజిపేట: అజ్జాడలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష – 2 వైద్య శిబిరంలో 285 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అరసాడ పీహెచ్‌సీ వైద్యాధికారి శశిధర్ ఆధ్వర్యంలో శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 285 మంది హాజరవగా వారికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు సందర్శించారు. కౌంటర్ల వద్ద రోగులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోగులకు మందుల వాడకంపై పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ చికిత్సలకు ఎవరు అర్హులు ఏ విధంగా దానిని వినియోగించుకోవాలనేది శిబిరాన్ని వచ్చిన రోగులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్‌నాయుడు, వైద్యాధికారి శశిధర్, స్పెషలిస్ట్ వైద్యులు సంధ్య, కోటేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ రవికుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.



బలిజిపేట: రోగులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా మలేరియా అధికారి

పిల్లలందరికీ డీ వార్మింగ్ మాత్రలు

సీతానగరం: జిల్లాలో పల్స్‌పోలియో తరహాలో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలందరికీ నులి పురుగుల (డీ వార్మింగ్) నివారణ మాత్రలు పంపిణీ చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నామని డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని శిథిలావస్థకు చేరిన పీహెచ్‌సీ భవనాన్ని, మందుల నిల్వలను, లక్ష్మీపురంలో జరుగుతున్న జేఏఎస్-2 ఉచితవైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీతానగరం పీహెచ్‌లో ఆయన మాట్లాడుతూ స్థానిక పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరడంతో ఇదే ప్రాంగణంలో రూ 9.8 లక్షల వ్యయంతో నూతన భవనం నిర్మాణం జరుగుతుందన్నారు. రూ.25 లక్షలతో కోవిడ్ పరీక్షల కేంద్రం భవన నిర్మాణం పనులు పూర్తి కావచ్చిందని అన్నారు. జిల్లాలోని ఈఆర్‌సీ నిధులతో 12 భవనాలు నిర్మాణాలు జరుగుతున్నాయని అన్ని భవనాల పనులు పూర్తి కావచ్చాయన్నారు. తాడికొండ, భామిని, తోనాం, బలిజిపేట, పాచిపెంట పీహెచ్‌సీల్లో భవనాలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. జిల్లాలో ఏడాది వయసు నుంచి 18 సంవత్సరాలలోపున్న వారికి నులి పురుగులు నివారణ మాత్రలు వేయడం జరుగుతుందన్నారు. మొత్తం 1,75,891 మంది పిల్లలకు డీ వార్మింగ్ మాత్రలు వేసేందుకు అవసరమైన ప్రణాళికలతో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారని తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పావనీ, సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, పీహెచ్‌ఎన్ సత్యవతి, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

వివాదాస్పద స్థల పరిశీలన

పాలకొండ: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న వివాదాస్పద స్థలాన్ని ఆర్డీఓ వెంకటరమణ శుక్రవారం పరిశీలించారు. కళాశాల సమీపంలో ఉన్న స్థలం ప్రభుత్వానికి చెందినది కాగా.. ఇందులో కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నారని కొంతమంది ఇటీవల ఆర్డీఓ, కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ వెంకటరమణ, తహసీల్దార్ వరహాలు, మండల సర్వేయర్ వెంకటరావు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, ఆక్రమణలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.



వివాదాస్పద స్థలం వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం

కురుపాం: మండలంలోని గొటివాడ గ్రామంలో గిరిజన మహిళల కోసం కుట్టుమిషన్ శిక్షణను ఎంపీపీ శెట్టి పద్మావతి శుక్రవారం ప్రారంభించారు. మహిళా వెల్ఫేర్ సొసైటీ సీఈవో పద్మ ఆధ్వర్యంలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో 45 రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు సంస్థలు ముందుకురావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతీ గిరిజన మహిళ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధి సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణ అనంతరం శిక్షణార్థులకు తమ బ్యాంక్ ద్వారా రుణాలు కూడా అందిస్తామని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రామకృష్ణ తెలిపారు. మహిళలంతా ఆర్థికంగా ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సునీత తదితరులు పాల్గొన్నారు.




కుట్టుమిషన్ శిక్షణను ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మావతి

అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

● డ్వామా పీడీ రామచంద్రరావు

పాచిపెంట: విధి నిర్వహణలో ఉపాధి సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని డ్వామా పీడీ రామచంద్రరావు హెచ్చరించారు. 2022 – 24 సంవత్సరంలో చేపట్టిన రూ.13 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి మండల కేంద్రం స్థానిక ఉపాధి కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బడ్నాన ప్రమీల అధ్యక్షతన శుక్రవారం సామాజిక ప్రజా తనిఖీ నిర్వహించారు. పంచాయతీల వారీగా ప్రజా తనిఖీ అధికారులు నివేదికలు చదివి వినిపించారు. పలు పంచాయతీలకు సంబంధించి రికార్డులు నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై పీడీ ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే చనిపోయిన వారి పేరిట బిల్లులు చెల్లింపులు, ఒకరి పేరు మీదుగా పని ఉంటే మరొకరికి బిల్లులు చెల్లించినట్టు తనిఖీల్లో వెల్లడైంది, వీటికి సంబంధించి పూర్తి స్థాయి నివేదిక అందజేయాలని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానన్నారు. ఎంపీడీఓ లక్ష్మీకాంత్, ఏపీడీ, ఏపీఎంలు మహేష్, కార్తీక్ డీఆర్‌పీలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు



జెడ్పీ సీఈవో రాజ్‌కుమార్

జియ్యమ్మవలస: రానున్న వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో కె.రాజ్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయంలోని రికార్డులను శుక్రవారం పరిశీలించిన ఆయన 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు, ఖర్చులు, జనరల్ ఫండ్ నిధులు-ఖర్చుల వివరాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికి గాను జిల్లాలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన రూ.16 కోట్లలో ఇప్పటికే రూ.8 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మండలంలో 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి రూ.23 లక్షలు, జనరల్ ఫండ్ నుంచి రూ.8 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వీటికి సంబంధించి, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, లోపాలుంటే వెంటనే సరిదిద్దుకోవాలని సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు 'పట్టా'భిషేకం



లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

● ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: పేదల మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేసి పట్టాభిషేకం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం మున్సిపాల్టీ 9, 13వ వార్డు సచివాలయాల పరిధిలో గతంలో మంజూరైన ఇళ్ల పట్టాలను ఆయన మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వీరందరికీ నర్సిపురం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్ రద్దు కావడంతో అందులో ఇళ్ల స్థలాలు పొందిన అర్హులందరికీ వెంకంపేట వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో స్థలాలను మంజూరు చేశామన్నారు. అందరి ఆశను నెరవేర్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఇళ్ల స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ కూడా చేయించి వాటిపై పూర్తి హక్కులు కల్పిస్తున్నారన్నారు. సీఎం జగనన్న చేసిన మేలును గుర్తించుకొని రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని అధిక మెజార్టీతో మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బి.జయబాబు, కౌన్సిలర్ సభ్యులు ఎడ్ల త్రినాధ, సచివాలయ కన్వీనర్లు రవికుమార్, బోను ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూర్జలో రూ.7లక్షలతో సీసీ రోడ్డు పనులు

సీతానగరం: మండలంలోని బూర్జ ఎస్సీ కాలనీలో రోడ్డు సమస్య తీరిందని సర్పంచ్ జి.దాసు, ఎంపీటీసీ జి.చిన్నంనాయుడు అన్నారు. శుక్రవారం బూర్జలో రూ.7లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మండల ఇంజినీరింగ్ అధికారి గంటా చంద్రమౌళి పర్యవేక్షణలో ఇంజినీరింగ్ సహాయకులు ఈర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో వారు పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీ వీధుల్లో తిరిగేందుకు కొద్ది రోజుల నుంచి ఇబ్బందులు పడేవారమని, దీంతో రోడ్డు సమస్యను ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తీసుకెళ్లడంతో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి జీజీఎంపీ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఆ నిధులతో రోడ్డు వేస్తున్నట్టు తెలిపారు. బీటీ రోడ్డు పనులు పూర్తి కావచ్చాయని, త్వరలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించనున్నారని తెలిపారు.

నిబంధనల మేరకు పనులు చేయండి

బలిజిపేట: ఉపాధి పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు చేయాలని ఎంపీడీఓ రమేష్‌నాయుడు వేతనదారులకు సూచించారు. నారాయణపురంలో ఉపాధి పనులను ఆయన శుక్రవారం పర్యవేక్షించారు. నిర్ధారించిన పని వేళలను పాటించాలన్నారు. ఎండల తీవ్రత బట్టి వడదెబ్బలకు గురికాకుండా చూసుకోవాలన్నారు. పనులకు సమయానికి వచ్చి నిర్ధారించిన ప్రకారం చేస్తే ప్రకటించిన వేతనం లభిస్తుందన్నారు. వేతనదారులు పని ముట్లతో పనులకు రావాలని తెలిపారు. ముందస్తు కొలతలు తప్పనిసరిగా ఉండాలన్నారు. 18సంవత్సరాల లోపు వారిని పనులకు తీసుకురావడానికి వీలులేదన్నారు. ఎవరి జాబ్‌కార్డు మీద వారే పనికి రావాలన్నారు. సకాలంలో పనికి హాజరవ్వాలని కోరారు. ఆయన వెంట ఏపీఓ కేశవరావు, సిబ్బంది ఉన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు

రహదారి నిబంధనలు పాటించాలి



పార్వతీపురం టౌన్: వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ సిబ్బంది

సాలూరు: రహదారి నిబంధనలు తప్పక పాటించాలని సీఐ జీడీ బాబు అన్నారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో ఆర్టీసీ డిపో నుంచి ప్రధాన రహదారి వరకు ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్లకార్డులతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భద్రతను పాటించడం ద్వారా ప్రమాదాలకు అడ్డుకట్ట వేయొచ్చన్నారు. సురక్షిత ప్రయాణానికి అవసరమైన నియమాలు పాటించాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పీఏ రావు, అధికారులు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

పార్వతీపురం టౌన్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంవీఐ శశికుమార్ అన్నారు. స్థానిక మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం వద్ద ఎన్‌సీసీ విద్యార్థులకు, వాహన చోదకులకు రహదారి భద్రత నియామావళిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా రహదారి భద్రత నియమావళిని పాటించాలన్నారు. హెల్మెట్ లేకపోవడం, సీట్‌బెల్ట్ లేకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, ఓవర్‌స్పీడ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆటోవాలాలు వాహనాలు నడిపేటప్పుడు పరిమితికి మించి లోడ్ వేయడంతో వాహనాలు అదుపుతప్పి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ప్రతీ ఒక్కరూ సహకరించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంవీఐ సత్యనారాయణ, రమేష్‌కుమార్, జి.సీతారాం, ఏఓ నారాయణరావు, మెడికల్ ఆఫీసర్ పి.వరప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీఐ, ఆర్టీసీ అధికారులు తదితరులు

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సూచించారు. మండలంలోని ఎల్విన్‌పేట అంగన్‌వాడీ కేంద్రం-2ను శుక్రవారం సందర్శించిన ఆయన చిన్నారుల ఎత్తు, బరువును స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆయా వివరాలు రికార్డుల్లో సక్రమంగా ఉన్నవీ లేనివీ పరిశీలించారు. గర్భిణులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేయడంతో పాటు వారు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణులకే అందించాలని, అలా అయితేనే ఆరోగ్యవంతమైన శిశువులు జన్మిస్తారన్నారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారి సంపూర్ణ ఆరోగ్యానికి తగిన సలహాలు, సూచనలివ్వాలన్నారు. రక్తహీనత నివారణ కమిటీ సభ్యులుగా ఉన్న ఏఎన్‌ఎం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు చురుగ్గా పనిచేయాలన్నారు. పదేళ్ల లోపు వయసు పిల్లల మరణాల రేటును తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన ప్రిజమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా చిన్నారుల్లో రక్తహీనత నివారణపై దృష్టిసారించాలన్నారు. అంతకుముందు దుడ్డుఖల్లు గిరిజన సంక్షేమ బాలురు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను కలెక్టర్ రుచి చూసి, పరిశీలించారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలన్నారు. ఆ తర్వాత దుడ్డుఖల్లు, బాలేసు, భద్రగిరి ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించి, సదుపాయాలపై ఆరాతీశారు. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపు వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో బి.చంద్రశేఖర్, తహసీల్దార్ బి.శివశంకర సత్యనారాయణ తదితరులు ఉన్నారు.



ఎల్విన్‌పేట అంగన్‌వాడీ కేంద్రం-2లో చిన్నారి బరువును స్వయంగా పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్